
వెయ్యి మందికి రెడ్ నోటీసులు



మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయం

- పాలమూరు పురపాలికలో రూ.35 కోట్ల ఆస్తి పన్ను పెండింగ్
- మొండి బకాయిదారులపై సీరియస్
- రాష్ట్రంలోని 142 పురపాలికల్లో పన్ను వసూలులో మహబూబ్‌నగర్ 134వ స్థానం
- రెడ్ నోటీసుకు స్పందించకుంటే ఆస్తుల జప్తు..



మహబూబ్‌నగర్ పట్టణం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలోనే అతిపెద్ద మునిసిపాలిటీ అయిన పాలమూరు పురపాలిక.. పన్నుల వసూలులో మాత్రం కింది నుంచి ముందు వరుసలో ఉంది. నిధుల సంకటంతో కొట్టుమిట్టాడుతున్న మునిసిపాలిటీలో అధికారం మారడంతో పాలకుల దృష్టి ఇప్పుడు మొండి బకాయిల వసూళ్లపై పడింది. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నా, గతంలో కంటె పాలన మెరుగుపడిందన్న అభిప్రాయం కలగాలన్నా వారికి మెరుగైన వసతులు కల్పించాల్సి ఉంది. వసతులు కల్పించాలంటే ఉన్న ఆదాయ వనరులను పెంచుకోవాలి. ఈ నేపథ్యంలో మూడేళ్లుగా పన్నులు చెల్లించని మొండి బకాయిదారుల జాబితా తయారు చేసిన అధికారులు బకాయిల లిస్టులు చూసి విస్తుపోయారు. ఏకంగా వెయ్యి మంది మొండి బకాయిదారులను గుర్తించిన అధికారులు వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసు అందుకున్న వాళ్ల మూడు నుంచి వారం రోజుల్లో బకాయిలు చెల్లించాలి. లేదంటే వారి ఆస్తులను సీజ్ లేదా జప్తు చేస్తారు. ఒక్కో యజమాని ఆస్తి పన్ను రూ.ఐదు లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పెండింగ్‌లో ఉండటం గమనార్హం. గతంలో పదేళ్ల పాటు ఒకే ప్రభుత్వం అధికారంలో ఉండటం, పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వారిలో మెజారిటీ సభ్యులకు అప్పటి అధికార పార్టీ అండదండలు ఉండటంతో బకాయిదారుల వద్దకు వెళ్లినప్పుడల్లా అధికారులకు ఫోన్‌లు వచ్చేవి. దాంతో బకాయి మొత్తం కాకుండా ఎంతోకొంత ముట్టజెపుతూ కాలం వెళ్లదీశారు. ఇప్పుడు అధికారం మారడం, తాజాగా పురపాలిక చైర్మన్ కూడా మారడంతో బకాయిలను వసూలు చేయాలని నిర్ణయించారు. ఇప్పుడు కూడా కొందరు అధికారంలో ఉన్నవారి వద్దకు వెళ్ళి బకాయిల విషయంలో కాస్త వెసులుబాటు కల్పించాలని పైరవీలు చేస్తుండటం విశేషం.

అద్దె వసూళ్లదీ అదే తంతు

ఆస్తి పన్ను వసూలు ఇలా ఉంటే.. మునిసిపాలిటీ దుకాణాల కిరాయిలదీ అదే పరిస్థితి ఉంది. పురపాలికలో 256 అద్దె దుకాణాలున్నాయి. వీటి ద్వారా రూ.23 కోట్ల వరకు అద్దె రావాల్సి ఉంది. ఇందులో కూడా రాజకీయజోక్యం కారణంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పడుతూ వస్తున్నాయి. ఒక్కో దుకాణంపై రూ.అర కోటి నుంచి రూ.కోటి వరకు బకాయి ఉంది. ఈ రూ.23 కోట్లలో రూ.ఏడు కోట్ల వరకు బకాయి ఉన్న దుకాణాలకు చాలా రోజుల నుంచి తాళాలు వేసి ఉంటున్నాయి. కొన్ని కోర్టు కేసుల కారణంగా పెండింగ్ చూపుతున్నా, మిగతా రూ.16 కోట్లు బకాయిలు దుకాణాలు నిర్వహిస్తున్నా అద్దె చెల్లించడం లేదని స్పష్టమవుతోంది. ఇక నీటి కొళాయిల బిల్లులు కూడా రూ.మూడు నుంచి రూ. నాలుగు కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా ఆస్తి పన్ను, దుకాణాల అద్దెలు, కొళాయిల బిల్లుల రూపంలోనే రూ.55 కోట్ల వరకు మునిసిపాలిటీకి రావాల్సి ఉంది. ఇవన్నీ వసూలు అయితే ఏడాది పాటు ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే అవకాశం ఉంటుంది.



రాష్ట్రంలోనే పూర్

పాలమూరు పురపాలిక పన్ను వసూలులో రాష్ట్రంలోనే కింది నుంచి ముందు వరుసలో ఉంది. రాష్ట్రంలో 129 మునిసిపాలిటీలు.. 13 కార్పొరేషన్‌లు ఉండగా, పాలమూరు పురపాలిక ఆస్తి పన్ను వసులులో 134వ స్థానంలో ఉండటం గమనార్హం. పురపాలికలో రూ.35.53 కోట్ల ఆస్తి పన్ను బకాయి ఉంది. పురపాలికలో 49,908 అసెస్‌మెంట్‌లు ఉండగా వీటి ద్వారా ఏటా రూ.18.72 కోట్ల పన్నులు రావాలి. రూ.13.21 కోట్లు పాత బకాయిలు ఉండగా, ప్రస్తుతం, పాత బకాయిలపై రూ.17 కోట్ల వరకు ఫెనాల్టీ ఉంది. ఇలా మొత్తం రూ.48.88 కోట్లకు గాను రూ.13.34 కోట్లు వసూలయ్యాయి. రూ.35.53 కోట్లు రావాల్సి ఉంది. వీటి వసూలు కోసం యంత్రాంగం ప్రయత్నాలు మొదలుపెట్టింది. మార్చి 31 నాటికి వంద శాతం వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ వీటిపై సీరియస్‌గా ఉన్నారు. రోజూ అధికారులతో మాట్లాడుతూ, వసూళ్లపై సమీక్ష చేస్తున్నారు. ఆర్‌వో, ఆర్‌ఐలకు రోజూ ఇంత వసూలు చేయాలని టార్గెట్‌లు విధించడంతో వారు మొండి బకాయిదారుల ఇళ్ల ముందు తిష్టవేస్తున్నారు. బకాయిల వసూలులో పనితీరు సరిగా లేనివారి జీతాలు నిలిపివేస్తామని హెచ్చరిస్తుండటంతో అధికారులు తలలు పట్టుకున్నారు.

వసూలు చేస్తాం

మొండి బకాయిదారులందరికీ రెడ్ నోటీసులు జారీ చేశాం. ఇచ్చిన గడువు ప్రకారం చెల్లించని వారి ఆస్తులు జప్తు చేస్తాం. చాలామంది మంచి పొజిషన్‌లో ఉన్నా పన్నులు చెల్లించడం లేదు. అలాంటి వారంతా పన్నులు చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి.

- ఆర్‌వో ఖాజా

పైరవీలు షురూ

ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలు చెల్లించాలని అడగడంతో అంతం మొత్తం చెల్లించలేక నాయకుల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేస్తున్నారు. మరికొందరు కొన్నాళ్లు ఇలానే హడావిడి చేసి వదిలేస్తారన్న ధీమాలో ఉన్నారు. అయితే బకాయిల వసూలుకు సమయం ఇస్తూ విడతలుగా వసూలు చేస్తే చాలావరకు వసూలు అయ్యే అవకాశం ఉంది.

ఎంపీ రాములు పార్టీ మార్పు

- రెండు రోజుల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం
- ఆ తర్వాత కాంగ్రెస్ లేదా బీజేపీ వైపు అడుగులు?



ఎంపీ రాములు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు పార్టీని వీడనున్నారు. బీఆర్‌ఎస్‌లో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు తనను అవమానపరిచేలా ఉన్నాయని భావిస్తున్న ఆయన కారు దిగడమే మేలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాల మేరకు కాంగ్రెస్ లేదా బీజేపీ వైపు ఆయన అడుగులు పడనున్నాయని సమాచారం.

సమాచారం ఇవ్వకపోవడంపై కోపంలో రాములు

సీనియర్ పొలిటిషియన్‌తో పాటు గతంలో మంత్రిగా, అచ్చంపేట ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన తనకు పార్లమెంటరీ పార్టీ సన్నాహక సమావేశాలకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై రాములు కోపంతో రగిలిపోతున్నారు. ఇంత దుర్మార్గమైన చర్య తనను మానసికంగా కలిచివేసిందని తన అనుచరుల వద్ద మదనపడినట్లు సమాచారం. వాస్తవంగా నిన్ననే ఎంపీ పదవికి రాజీనామా చేయాలని రాములు నిర్ణయం తీసుకున్నా.. ఆయన వెన్నంటే ఉన్న కార్యకర్తలు సముదాయించినట్లు తెలిసింది. రెండు రోజుల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను రూపొందించుకుందామని అనుచరులు ఇచ్చిన సలహాతో ఆయన వెనక్కి తగ్గారు.

భరత్‌కు టికెట్ ఇస్తేనే?

బీఆర్‌ఎస్‌ను వీడాలని తనకు మనసులో లేకున్నా.. తప్పనిసరి పరిస్థితులు ఆ అవకాశాన్ని కల్పిస్తున్నాయని, తన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పిస్తే పార్టీలోనే కొనసాగాలని రాములు నిర్ణయించుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక వేళ పార్టీ మారాలనుకుంటే అటు కాంగ్రెస్ లేదా బీజేపీల వద్ద ఒక కండీషన్ విధించినట్లు సమాచారం. తన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు టికెట్ ఇస్తే తాను రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకుంటానని కూడా ఆయా పార్టీల అధిష్ఠానాలతో వెల్లడించినట్లు తెలుస్తోంది. త్వరలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఎంపీ రాములు త్వరితగతిన రెండు రోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

నూర్పిడి యంత్రంలో పడి మహిళ మృతి

జడ్చర్ల, ఫిబ్రవరి 26: వేరుశనగ నూర్పిడి యంత్రంలో పడి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిన్నఆదిరాల గ్రామానికి చెందిన జ్యోతి(45) సోమవారం చనిపోయింది. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జ్యోతికి మూడు ఎకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ పంట వేసింది. వేరుశనగ పొట్టు తీసేందుకు గ్రామ సమీపంలోని తండాకు చెందిన ఓ వ్యక్తి నూర్పిడి యంత్రాన్ని కిరాయికి తీసుకుంది. పొలంలో కాయలను తొలుస్తున్న క్రమంలో యంత్రం బెల్ట్‌లో జ్యోతి చీరకొంగు ఇరుక్కుంది. దీంతో బెల్ట్‌తో పాటు ఆమె మిషన్‌లో ఇరుక్కుని మృతి చెందింది. యంత్రం బెల్ట్, ఫ్యాన్ వద్ద జాలీలు ఏర్పాటు చేయాల్సి ఉండగా చేయలేదని, అందుకే ప్రమాదం జరిగిందని యంత్రం యజమాని ఇంటి ముందు జ్యోతి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. జ్యోతి భర్త పాండు మూడు నెలల క్రితం మృతి చెందాడు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. జ్యోతి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

ఇక్కడా అక్రమాలు

విచారిస్తే వెలుగులోకి..

- గొర్రెల స్కాంలో అరెస్టైన ఆదిత్య కేశవ సాయి గద్వాలలోనూ విధులు
- బినామీ పేర్లతో గొర్రెల యూనిట్ల కేటాయింపు
- రాష్ట్ర అధికారులకు తెలియకుండా ఆవుల పంపిణీ
- రవాణా కోసమే ఒక్కో లబ్ధిదారు నుంచి రూ.12 వేలు వసూలు
- వాతావరణం తట్టుకోలేక కొన్ని మృతి.. మరికొన్ని విక్రయం
- గద్వాలలో విచారణ జరుగుతుందని మధ్యదళారుల్లో గుబులు



రైతులకు పంపిణీ కోసం నాసిక్ నుంచి తెచ్చిన ఆవులు(ఫైల్)

గద్వాల, ఫిబ్రవరి 26: గొర్రెల పంపిణీ స్కాం రాష్ట్రంలో సంచలనం కలిగిస్తుండగా, అందులో అవినీతికి పాల్పడిన నలుగురు పశుసంవర్ధక శాఖ అధికారులను ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్టు అయిన వారిలో ఒకరైన ఆదిత్య కేశవ సాయి గద్వాలలో ఏడీగా పని చేశారు. ఈ నేపథ్యంలో విచారణలో భాగంగా ఏసీబీ అధికారులు గద్వాలకు వస్తే గొర్రెలు, ఆవుల పంపిణీలో జరిగిన అక్రమాలు ఎక్కడ బహిర్గతం అవుతాయేమోనని మధ్య దళారులు బెంబేలెత్తుతున్నారు. ఆదిత్య కేశవసాయి ఎక్కడెక్కడ పని చేశారనే విషయాలను ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఆయన హయాంలోనే ఇక్కడ మొదటి విడుత గొర్రెల పంపిణీ జరిగింది. బినామీ పేర్లతో యూనిట్లను కేటాయించి అవినీతి పాల్పడ్డారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఆయన హయాంలోనే గొర్రెల పంపిణీ..

గొర్రెల పంపిణీ పథకం 2017లో ప్రారంభం అయ్యింది. సహకార సంఘాల ఏర్పాటు, సభ్యుల సభ్యత్వం పూర్తయి, లబ్ధిదారులు ఎంపిక నాటికి ఏడీగా ఆదిత్యకేశవ సాయి వచ్చారు. ఈయన గద్వాలలో 2018 నుంచి 2020 వరకు పనిచేశారు. ఆ సమయంలోనే 206 సహకార సంఘాల్లోని 13,255 మందికి యూనిట్లను పంపిణీ చేశారు. సభ్యుల ఎంపికలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బినామీ పేర్లతో యూనిట్ల కేటాయింపునకు మధ్య దళారులతో చేతులు కలిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా గొర్రెలు రీసైక్లింగ్ చేసేవారితో చేతులు కలిపి, వారి గొర్రెలను పంపిణీ అయ్యేలా సహకారం అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రవాణా పేరిట పెద్ద ఎత్తున బిల్లులు దండుకున్నట్లు తెలిసింది. ఆయన హయాంలో సహకార సంఘం అధ్యక్షులతో పాటు మధ్య దళారులు, రీసైక్లింగ్ ముఠాలు, నాయకులు పెద్ద ఎత్తున వెనకేసుకున్నారని చర్చ జరుగుతోంది.

ఏం జరిగిందో తెలియదు

గొర్రెల పంపిణీ యూనిట్లలో అవినీతి ఏం జరిగిందో తెలియదు. ఆవుల పంపిణీ అనేది ప్రభుత్వ పథకం కాదు. ఆదిత్యకేశవ సాయిపై గద్వాలలో కూడా విచారణ చేస్తారనే సమాచారం ఇప్పటి వరకు రాలేదు. విచారణ అధికారులు వస్తే సహకరిస్తాం.

- వెంకటేశ్వర్లు, జిల్లా పశు వైద్యాధికారి

రాష్ట్ర అధికారులకు తెలియకుండా ఆవుల పంపిణీ

రాష్ట్రంలో ఎక్కడా లేని ఆవుల పంపిణీ పథకాన్ని గద్వాలలో ఆదిత్యకేశవ సాయి హయాంలో నిర్వహించారు. మిలటరీ అవసరాల పాల ఉత్పత్తుల కోసం ఆవుల పెంచుతారు. అయితే నాసిక్‌లోని మిలటరీ క్యాంపులో జీవితకాలం తగ్గిపోతున్న ఆవులను గద్వాలలోని రైతులకు అంటగట్టేందుకు ఇక్కడి పాలకులతో చేతులు కలిపి, వెయ్యికిపైగా ఆవులను తెచ్చారు. రాష్ట్ర అధికారులకు తెలియకుండానే వారి పేరు మీద గద్వాలకు తీసుకొచ్చారు. రవాణా, ఇతర నిర్వాహణ ఖర్చుల కోసం రైతుల నుంచి ఒక్కో ఆవుకు రూ.12 వేలు వసులు చేశారు. రైతులకు పంపిణీ చేసిన ఆవులు ఇక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకోలేక కొన్ని చనిపోగా, మిగిలిన వాటిని రైతులు విక్రయించారు. ఈ పథకం మూణ్ణాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. వీటి రవాణా, పంపిణీలో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. కానీ రాష్ట్ర డైరెక్టర్ అకౌంట్‌ను ఉపయోగించుకోవడంతో సమస్య ఏర్పడి, ఆదిత్య కేశవ సాయిపై విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అయినా ఆయనలో మార్పు మాత్రం రాలేదు.

తోటి అధికారులతో దురుసు ప్రవర్తన

గొర్రెలు, ఆవుల పంపిణీలో నిబంధనలు పాటించకుండా తాను చెప్పిందే చేయాలనే ధోరణిలో ఉన్న ఆయన తోటి అధికారులతో ఘర్షణ పడేవారు. నిజమైన లబ్ధిదారులకు సహాయం అందించాలని కోరినా.. తాను చెప్పిందే చేయాలనే హుకుం జారీ చేస్తుండటంతో ఓ సందర్భంలో తోటి అధికారితో ఘర్షణ పడి ఒకరునొకరు కొట్టుకున్నారు. ఈ క్రమంలో ఓ అధికారికి రక్తగాయాలు అయ్యాయి. ఈ విషయం పెద్దదై సంఘాలు జోక్యం చేసుకోవడంతో ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి, ఆయన్ను గద్వాల నుంచి బదిలీ చేశారు. బదిలీ అయిన చోట కూడా అవినీతి అక్రమాలకు పాల్పడటంతో ఆయనపై రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడంతో ఏసీబీ అధికారులు విచారణ చేసి, ఆదిత్యకేశవ సాయిని అరెస్టు చేశారు. పూర్తిస్థాయి విచారణలో భాగంగా గద్వాలలో కూడా విచారణ చేస్తారనే టాక్ వినిపించడంతో మధ్య దళారుల గుండెల్లో రైలు పరిగెడుతున్నాయి. ఇక్కడ కూడ గొర్రెల పంపిణీ, ఆవుల పంపిణీపై విచారణ చేస్తే మరింత అక్రమాలు వెలుగులోకి వస్తాయి.

అమృత్ భారత్‌తో.. మౌలిక సదుపాయాలు



జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో ఆధునీకీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి; చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, డీకే అరుణ

జడ్చర్ల, ఫిబ్రవరి 26: జడ్చర్ల రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకంలో చేర్చి, రూ.10.94 కోట్లతో ప్రయాణికులకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రధాని నరేంద్రమోదీ చర్యలు చేపట్టారని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో చేపట్టనున్న ఆధునికీకరణ పనులకు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డిలతో ఎంపీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ వర్చువల్‌గా ఈ పథకం కింద పనులకు శంకుస్థాపన చేశారని చెప్పారు. పరిపాలన దక్షత కలిగిన నాయకుడు ప్రధాని అని కొనియాడారు. డీకే అరుణ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.5,071 కోట్లతో అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో ఆధునికీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వాటితో పాటు బ్రిడ్జిల నిర్మాణం, ఆర్‌వోబీ, ఆర్‌యూబీల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. ఈ పథకంలో భాగంగా ప్రయాణికులకు లిఫ్ట్, ప్లాట్‌ఫాంల అనుసంధానంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలతో పాటు విమానాశ్రయాలకు దీటుగా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీ, జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్‌యాదయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, రైల్వే సీనియర్ డీఎంఈ జీషన్ అహ్మద్, ఏసీఎం భాగ్యం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సీతారాంరుూవర్, బాల త్రిపురసుందరి, ముచ్చర్ల కృష్ణయ్య సాహితి రెడ్డి, సామల నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిని చంపిన అన్న


పాత కక్షలే కారణం

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 26: నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పుల్లగిరి గ్రామంలో ఆదివారం రాత్రి అన్న సత్తయ్య చేతిలో తమ్ముడు ఆంజనేయులు(36) హతమయ్యాడు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వేర్వేరుగా కాపురం ఉంటున్న సత్తయ్య, ఆంజనేయులు మధ్య గొడవలు ఉన్నాయి. తమ అమ్మానాన్నలకు సంబంధించిన మంచంపై తాను పడుకుంటానంటే తాను పడుకుంటానంటూ ఇద్దరూ గొడవ పడి దూషించుకున్నారు. వారి మధ్య కొంత కాలంగా పాత కక్షలు ఉండటంతో కోపోద్రిక్తుడైన అన్న సత్తయ్య తమ్ముడు ఆంజనేయులు తలపై ఇనుప రాడ్డుతో బలంగా కొట్టాడు. దాంతో ఆంజనేయులు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇరుగు పొరుగు వారు వెళ్లి పరిశీలించగా, అప్పటికే మృతి చెందాడు. సీఐ కనకయ్యగౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తర్వాత సత్తయ్య పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. ఆంజనేయులు భార్య సాయమ్మ సత్తయ్య, ఆయన భార్య గౌరమ్మ, వారి కుమారుడు మహేష్‌పై చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పడమటి సంధ్యారాగం




అస్తమిస్తున్న సూర్యుడు



పసిడి వర్ణంలోకి మారిన ఆకాశం

సాయం సంధ్య వేళ మహబూబ్‌నగర్ పట్టణంలోని ఆకాశం పసిడి వర్ణంలోకి మారింది. సూర్యుడి కిరణాలు తాకి భవనాలు ఇంద్రధనస్సులా మారాయి. విద్యుత్ లైట్లు కాంతులీనాయి. అస్తమించాక ఆకాశం నుదిటిన సింధూరంలా మారిన భానుడిని 'ఆంధ్రజ్యోతి' సోమవారం క్లిక్ మనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్



అస్తమిస్తున్న సమయంలో అరుణ వర్ణంలోకి మారిన సూర్యుడు

లలితాంబిక సోమేశ్వరాలయాన్ని సందర్శించిన రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్



లలితాంబిక సోమేశ్వరాలయంలో రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోలీకేరిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 26 : కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల లలితాంబిక సోమేశ్వరాలయాన్ని సోమవారం రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోలీకేరి సందర్శించారు. ఈ సందర్భంగా లలితాంబిక సోమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గోవిందొరెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిలేటి, సభ్యుల ఆధ్వర్యంలో పురోహితులు పూర్ణకుంభంతో భారతి హోలీకేరికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సోమశిల లలితాంబిక సోమేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు పురావస్తు, పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరడంతో మంత్రి ఆదేశానుసారం ఆలయాన్ని భారతి హోలీకేరి సందర్శించారు. పురాతన ప్రాచీన ఆలయాల విశిష్టతను కాపాడుతూ వాటికి ఎలాంటి భంగం కలుగకుండా ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఏర్పాట్లు చేయాల్సిన సౌకర్యాలకు అనుమతులు కల్పించేలా చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని ఆమె తెలిపారు. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ప్రాచీన ఆలయాల విశిష్టతను కాపాడుతూ వాటిని పరిరక్షించేందుకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పురావస్తు శిల్పాలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోవిందొరెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిలేటి, నాయకులు రామ్మోహన్, రామకృష్ణ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం

- ముగిసిన మన్యంకొండ బ్రహ్మోత్సవాలు



గ్రామోత్సవంలో స్వామివారు

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 26: మన్యంకొండ శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామివారి బహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్ స్వామివారికి చక్రస్నానం చేయించారు. అభిషేకాల అనంతరం స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత గామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ శనివారం గ్రామోత్సవం, మార్చి 6న శేషవాహన సేవ, 8న మహాశివరాత్రి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ధర్మకర్త తెలిపారు. మార్చి 23నుంచి 27 వరకు అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, అంకురార్పణముతో ప్రారంభమై పూర్ణాహుతి, వసంతోత్సవ కార్యక్రమంతో ముగుస్తాయని ఆయన వివరించారు.

డీజిల్‌లో నీరొచ్చిందని వినియోగదారుడి ఆందోళన

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని టెలిఫోన్ ఎక్ఛేంజ్ సమీపంలోని పెట్రోల్‌బంకులో డీజిల్ పోయించుకుంటే నీరొచ్చిందని వి నియోగదారుడు నరేందర్‌రెడ్డి పెట్రోల్ బంకు ముందు సోమవారం ఆందోళన ని ర్వహించారు. తాను డీజిల్ పోయించుకుని తన వాహనాన్ని తీసుకెళ్లగా కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఆగిపోయిందని తీరా విప్పి చూస్తే నీరొచ్చిందని పేర్కొ న్నారు. దీంతో తన వాహనం మొరాయించిందని అన్నారు.

రేపు ఎంపీపీ ఎన్నికకు ప్రత్యేక సమావేశం

కొల్లాపూర్, ఫిబ్రవరి 26 : తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఆధారంగా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఉత్తర్వుల మేరకు ఈ నెల 28న కొల్లాపూర్ మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పట్టాభి రామారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గ్రామ పంచాయతీ వర్కర్ మృతి

లింగాల, ఫిబ్రవరి 26: మండల పరిధిలోని పద్మన్నపల్లి గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పని చేస్తున్న నేణావత్ స్వామి (47) సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతు డు గ్రామ పంచాయతీ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై లింగాలకు వచ్చి తిరు గు ప్రయాణంలో ఈసంఘటన చోటు చేసుకుంది. ఎస్సీ కాలని దాటిన తర్వాత వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో కింద పడి తలకు బల మైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య శంకరమ్మ గత 8నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు వాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేటకు తరలించారు. పంచాయతీ కార్మికుడి మృతి పట్ల కార్యదర్శి భానుచందర్, మాజీ సర్పంచ్ దేవి, తోటి కార్మికులు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 26 : చేపల వేటకు వెళ్లి కుర్మయ్య(45) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడకు చెందిన కుర్మయ్య ఆదివారం చేపల వేటకు వెళ్లి కేసరి సముద్రంలో పడి కన్పించకుండాపోయాడు. సోమవారం శవమై తేలాడు. ఈ సంఘటనపై మృతుని కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికకు త్రుటిలో తప్పిన ప్రమాదం

లింగాల, ఫిబ్రవరి 26: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రమైన లింగాలలో సోమవారం బాలికకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలు ఈ వి ధంగా ఉన్నాయి. సేవాలాల్ జయంతి సందర్భంగా యువకులకు 2కేరన్ పోటీల ను నిర్వహించారు.

కొత్తబస్టాండు ఆవరణలో నిలిచి ఉన్న డీజేను పక్కకు తీసే క్రమంలో అక్కడే ఉన్న ఆర్టీసీ బస్సును డీజే ఢీకొట్టడంతో బస్సు ఎక్కేందుకు వెళ్తున్న బాలికకు డీజే వాహనం తగిలి స్వల్ప గాయాలకు గురైంది. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు బాలికను ఆస్పత్రికి తరలించి చికి త్స చేయించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అయిజ, ఫిబ్రవరి 26 : జోగులాంబ గద్వాల జిల్లాలోని తుంగభద్ర నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ విజయ్‌బాస్కర్ తెలిపారు. మేడికొండ గ్రామానికి చెందిన చాకలి వీరేష్ సోమవారం రాత్రి తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా అయిజ పట్టణంలోని మేడికొండ చౌరస్తా వద్ద పట్టుకున్నట్లు తెలిపారు.

అలాగే తుపత్రాల గ్రామానికి చెందిన బోయ వీరేష్ కేశవరం నుంచి చిన్నతాండ్రపాడు మీదుగా ట్రాక్టర్లో ఇసుకను తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

కూతురి చదువుకు రుణం కోసం ఫోన్‌చేసి..
సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కిన తండ్రి

» రూ. 1,37,000లు పోగొట్టుకున్న వైనం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా రుణం పొందడం కోసం గూగుల్ చేసి.. కనిపించిన నంబర్లకు ఫోన్ చేసి, ఆవలి వ్యక్తుల మాటల్లో పడిపోయారో.. రుణం మాట దేవుడెరుగు, ఉన్న డబ్బంతా ఖాళీ అవ్వొచ్చు! మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌కు చెందిన వేణుగోపాల్ రెడ్డి అనే 52 ఏళ్ల వ్యక్తి ఇలానే నిండా మునిగారు. ఆయన.. తన కూతురు ఉన్నత చదువుల కోసం అప్పు చేయాలనుకున్నారు. నిరుడు డిసెంబరులో 'జస్ట్ డయల్ సర్వీసు'కు ఫోన్ చేసి తనకు రూ.30 లక్షల రుణం కావాలని అడిగారు. తర్వాత వేణుగోపాల్ రెడ్డికి 'బజాజ్ ఫైన్ సర్వీస్' నుంచి అమిత్ అగర్వాల్ పేరుతో ఫోనొచ్చింది. 'మీరు మీ అమ్మాయి ఉన్నతవిద్య కోసం రూ.30లక్షల రుణం అడిగారని తెలిసింది. మా కంపెనీ నుంచి రుణం ఇస్తాం, ఇందుకు ప్రాసెసింగ్ ఫీజు రూ.15వేలు చెల్లించాలి' అని ఆవలి వ్యక్తి చెప్పాడు. నిజమేనని నమ్మిన వేణుగోపాల్‌రెడ్డి 2023 డిసెంబరు 22న రూ.15వేలు పంపారు. తర్వాత బజాజ్ ఫైన్ సర్వీస్ నుంచి ఆ వ్యక్తే మళ్లీ ఫోన్‌చేసి.. బీమా లేకుండా రుణం మంజూరైందని, బీమా కావాలంటే రూ.47,500 పంపాలని చెప్పారు. ఆ మొత్తాన్ని 2023 డిసెంబరు 25వ తేదీన వేణుగోపాల్ రెడ్డి ట్రాన్స్‌ఫర్ చేశారు. జీఎస్టీ కోసం మరో రూ.75వేలు అడిగితే కూడా పంపారు. ఇలా మొత్తం రూ.1.37 పంపించారు. ఆ మరుసటి రోజు అమిత్ అగర్వాల్ ఫోన్ చేసి మరిన్ని డబ్బులు అడగటంతో అనుమానం వచ్చి ఆన్‌లైన్‌లో విచారించగా అదంతా మోసమని తెలిసింది. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తికోసం ప్రయత్నించగా స్పదించకపోవడంతో మోసపోయానని వేణుగోపాల్ రెడ్డి గ్రహించారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రష్యా సైన్యం నుంచి భారత హెల్పర్లు తిరిగి రాక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: రష్యా సైన్యంలో 'సెక్యూరిటీ హెల్పర్లు'గా పనిచేస్తున్న భారతీయులను అక్కడి ప్రభుత్వం తిప్పిపంపింది. భారత ప్రభుత్వ డిమాండును మన్నించి వారిని వెంటనే ఆర్మీ నుంచి పంపించివేసిందని సోమవారం విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. భారత్‌కు చెందిన కొందరు వ్యక్తులు రష్యా సైన్యంలో సహాయ సిబ్బందిగా నియమితులయ్యారు. అయితే ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొనాలని ఒత్తిడి చేయడంతో వారిలో ఆందోళన మొదలయింది. తమను ఆదుకోవాలని రష్యాలోని భారత రాయబార కార్యాలయాన్ని కోరారు. ఈ సమస్యను ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ వ్యవహారాల శాఖ చేసిన కృషి ప్రయత్నంగా రష్యా ప్రభుత్వం వారిని తిప్పి పంపించడానికి సిద్ధమయింది. వారిలో కొందరు ఇప్పటికే స్వదేశానికి పయనమయ్యారు. భారతీయులు ఎవరూ యుద్ధ క్షేత్రంలో విధులకు వెళ్లకూడదంటూ గత వారమే విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ హెచ్చరించడం గమనార్హం.

ట్రూకాలర్‌లో ఏఐ ఆధారిత కాల్ రికార్డింగ్ ఫీచర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: స్వీడన్‌కు చెందిన కాలర్ ఐడెంటిఫికేషన్ యాప్ ట్రూకాలర్.. భారత్‌లో ఆర్టిఫీషియల్ ఆధారిత (ఏఐ) ఆధారిత కాల్ రికార్డింగ్ ఫీచర్‌ను ప్రారంభించినట్టు సోమవారం ప్రకటించింది. ఏఐ కాల్ రికార్డింగ్ అనేది పెయిడ్ (చెల్లింపు) ఫీచర్ అని, ఇది ట్రూకాలర్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌లో అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజ్‌లలోఇది పని చేస్తుందని తెలిపింది. ప్రీమియం ప్లాన్‌లో భాగంగా ఏఐ ఆధారిత కాల్ రికార్డింగ్ సదుపాయం నెలకు రూ.75తో లేదా ఏడాదికి రూ.529తో ప్రారంభం అవుతుందని పేర్కొంది.

కార్తీ చిదంబరంపై ఈడీ తాజా చార్జిషీటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరంపై ఈడీ తాజాగా మరో ఛార్జిషీటు దాఖలు చేసింది. ఆయన తండ్రి పి.చిదంబరం కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు 2011లో చైనా జాతీయులకు అక్రమంగా వీసాలు ఇప్పించారంటూ కేసు నమోదు చేసింది. దీనిపై మార్చి 16న విచారణ జరపనున్నట్టు ప్రత్యేక న్యాయస్థానం తెలిపింది.

వనపర్తి మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

» కలెక్టర్‌కు నోటీసు అందజేసిన కౌన్సిలర్లు

» తిరుమలగిరి చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై కూడా..



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేస్తున్న కౌన్సిలర్లు


వనపర్తి టౌన్, తిరుమలగిరి, ఫిబ్రవరి 26: వనపర్తి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి అవిశ్వాసానికి సంబంధించిన నోటీసు అందజేశారు. వీరికి కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలపడంతో బల నిరూపణ జరిగే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తర్వాత బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధం కాగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లతో చర్చలు జరిపారు. మూడుసార్లు ఈ చర్చలు జరిగాయి. చివరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి అవిశ్వాసానికి నోటీసు అందజేశారు. వనపర్తి మునిసిపాలిటీలో 33 వార్డులు ఉండగా కాంగ్రెస్ నుంచి 9 మంది, టీడీపీ నుంచి ఒకరు, బీఆర్ఎస్ నుంచి 23 మంది కౌన్సిలర్లున్నారు. కలెక్టర్‌కు ఇచ్చిన నోటీసులో 15 మంది బీఆర్ఎస్, ఏడుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక టీడీపీ కౌన్సిలర్ సంతకాలు చేయగా కాంగ్రెస్ నుంచి ఇద్దరు, 8 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సంతకాలు చేయలేదు. బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు కాంగ్రెస్ మద్దతు తీసుకోవడంతో బలనిరూపణ తర్వాత కొత్తగా ఎన్నికయ్యే వారు బీఆర్ఎస్‌లోనే ఉంటారా లేక కాంగ్రెస్‌లోకి వెళ్తారా అనేది తేలనుంది.

'తిరుమలగిరి' చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపైనా...

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. సోమవారం 8 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ వెంకటరావును కలిసి అవిశ్వాస తీర్మాన పత్రాలు అందజేశారు. తిరుమలగిరి మునిసిపాలిటీలో 15వార్డులుండగా.. బీఆర్ఎస్ నుంచి ఎనిమిది, కాంగ్రెస్ నుంచి ఆరు, బీజేపీ నుంచి ఒక కౌన్సిలర్ ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన పోతరాజు రజనీ, సంకేపల్లి రఘునందన్‌రెడ్డి చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. మునిసిపల్ పాలనా వ్యవహారాల్లో చైర్‌పర్సన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. అవినీతికి పాల్పడుతూ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడంలేదంటూ 8 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం ప్రతిని అందజేశారు. దీన్ని పరిశీలించి సమావేశం నిర్వహణ తేదీ నిర్ణయిస్తామని కలెక్టర్ తెలిపారని కౌన్సిలర్ ఎల్సోజు నరేష్ చెప్పారు.

మా పొత్తు సూపర్‌హిట్

చెడగొట్టేందుకు శతవిధాలా జగన్ యత్నాలు: చంద్రబాబు



శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ-జనసేన కాంబినేషన్ సూపర్‌హిట్. వైసీపీకి ప్యాంట్లు తడిసిపోతున్నాయి' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. తమ మధ్య పొత్తు కుదరకుండా చెడగొట్టడానికి సీఎం జగన్ శతవిధాలుగా ప్రయత్నించాడని.. ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా కుట్రలు పన్నుతున్నాడని ధ్వజమెత్తారు. 'రా కదలిరా' కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఇక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ మంత్రులు కిమిడి కళావెంకట్రావు, గుండ అప్పల సూర్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, కోండ్రు మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ పొత్తు తన కోసమో, పవన్ కల్యాణ్ కోసమో కాదని.. ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం కోసమేనని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 'మా పొత్తును ప్రజలు ఆమోదించారు. మాకూ అవగాహన ఉంది. మధ్యలో మీకేంటి బాధ? కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. వైసీపీవి నీచ, చవట రాజకీయాలు. అందుకే ఆ పార్టీకి స్వస్తి పలకాలి. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అందరం కృషిచేద్దాం' అని పిలుపిచ్చారు. జగన్‌ను ఉత్తరాంధ్ర ద్రోహిగా అభివర్ణించారు. జీవితంలో వాస్తవాలు చెప్పడని.. అబద్ధాలు చెప్పడంలో పీహెచ్‌డీ చేశాడని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో కుట్రలకు పాల్పడుతున్నాడని.. కులాల మధ్య చిచ్చుపెడుతున్నాడని దుయ్యబట్టారు. సైకో పాలనతో రాష్ట్రం నిరుద్యోగంలో నంబర్ వన్ అయిందన్నారు. 'రాష్ట్రంలో ఏ ఒక్కరికీ భద్రత లేదు. చివరకు మీడియాకూ భద్రతలేదు. వారిపైనా దాడులు చేయిస్తున్నాడు. వారికి వ్యతిరేకంగా జీవో 243 తీసుకొచ్చాడు'అని ధ్వజమెత్తారు. ఇంకా ఏమన్నారంటే..

కొత్త నాటకాలు..

ఈ జగన్ కొత్తనాటకాలకు తెరతీశాడు. పేదల మనిషంట! వేల కోట్లను దోచుకుని.. పేదల పథకాలను రద్దు చేసి పేదల ప్రతినిధినని చెప్పుకొంటున్నాడు. నువ్వు ఏవిధంగా పేదల మనిషివి? ప్రజలను అంతం చేయాలని చూస్తున్న భస్మాసురుడివి. తొమ్మిది దఫాలు విద్యుత్ చార్జీలు పెంచావు. పేదలపై రూ.65 వేల కోట్ల భారం మోపావు. ఇందుకేనా సిద్ధమని ప్రగల్భాలు పలుకుతున్నావు. 24 గంటలపాటు కరెంట్ ఇచ్చావా? నువ్వు మాత్రం రూ.20 కోట్లతో బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొనుక్కున్నావు. హెలికాప్టర్లో తిరుగుతూ.. పోలీసులను, పరదాలను అడ్డుపెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నావు. పేదలకు అన్నం పెడితే సహించలేక అన్న క్యాంటీన్లను తొలగించేశావ్. అప్పట్లో రూ.50 ఉండే మద్యం క్వార్టర్.. ఇప్పుడు రూ.200 చేసేశావు. నాసిరకం మద్యం విక్రయిస్తూ పేదల రక్తం తాగుతున్న నువ్వు పేదల ప్రతినిధివి ఎలా అవుతావ్? మేం ఉచితం ఇసుకను ఇస్తే.. ఇప్పుడు మంత్రులు, మీ పార్టీ నాయకులు పంచుకుంటున్నారు. దొంగలని ఎవరిని అనాలి?

వైసీపీకి అభ్యర్థుల్లేరు..

వైసీపీ తరఫున పోటీకి అభ్యర్థులు కూడా లేరాయె! మొన్నటివరకు ఒక్కో లిస్టు రిలీజ్ చేసేసి సిద్ధం అన్నాడు. ఇప్పుడు మాట మార్చి ఆ లిస్టుల్లోని వారు కేవలం నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు అని, అభ్యర్థులు కారని చెబుతున్నారు. నేను అభ్యర్థుల ఎంపిక విషయంలోనూ పారదర్శకంగా ఉన్నా. ఫోన్ ద్వారా అభ్యర్థులను ప్రజల ముందుంచాను.. వైసీపీని ఇంటికి పంపించేయాలన్నదే అందరి ధ్యేయం. రాష్ట్రంలో మీడియాకు కూడా స్వేచ్ఛ లేకుండా పోయింది. వాస్తవాలను చూపిస్తున్న వారిపై దాడులకు పాల్పడుతున్నారు. వైసీపీ సభలో నాది, పవన్ కల్యాణ్ ఫొటోలతో కటౌట్లు పెట్టించి వాటిపై దాడులు చేయించారు. మానసిక రోగులు మాత్రమే ఇలాంటి పనులు చేస్తారు. మా సభలో జగన్ రెడ్డి బొమ్మ పెట్టించి కొట్టించలేమా? అది సభ్యత కాదు. చొక్కా చేతులు మడతపెట్టమని అంటున్నాడు. జగన్‌రెడ్డీ.. మీరు చొక్కా మడతపెడితే మా తమ్ముళ్లు కుర్చీలు మడతపెడతారు. నీకు కుర్చీ లేకుండా చేస్తారు. మిడిసిపడితే బట్టలు విప్పించి తరిమి తరిమి కొట్టే ధైర్యం మా తమ్ముళ్లకు ఉంది.

మాజీ మంత్రి సోమిరెడ్డిపై హత్యాయత్నం

» గడ్డపారతో దాడికి యత్నించిన వైసీపీ సానుభూతిపరుడు

» అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు, తోపులాట

» పోలీసులకు సోమిరెడ్డి ఫిర్యాదు

» 11 మంది టీడీపీ కార్యకర్తలపై కేసు..!

నెల్లూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కట్టువపల్లిలో సోమవారం సాయంత్రం వైసీపీ సానుభూతిపరుడు బల్లి వెంకటయ్య గడ్డపారతో సోమిరెడ్డిపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన టీడీపీ కార్యకర్తలు వెంకటయ్యను అడ్డుకున్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం కట్టువపల్లిలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమిరెడ్డి వస్తున్న నేపథ్యంలో ఆదివారం రాత్రే స్థానిక టీడీపీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు బల్లి వెంకటయ్య టీడీపీ ఫ్లెక్సీలను చించి చెరువులో పడేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు సోమవారం ఉదయం మరోమారు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా మళ్లీ వాటినీ చించేశారు. సాయంత్రం 4 గంటల సమయంలో సోమిరెడ్డి కట్టువపల్లికి చేరుకోగా మద్యం మత్తులో ఉన్న వెంకటయ్య వీరంగం సృష్టించాడు. అసలు మా గ్రామానికి టీడీపీ వాళ్లు ఎందుకొస్తున్నారు..? అంటూ కేకలు వేశాడు. బాణాసంచా కాలుస్తున్న టీడీపీ కార్యకర్తను కొట్టాడు. గ్రామస్థులు, వెంకటయ్య బంధువులు ఎంత నచ్చజెప్పినా ఆయన పట్టించుకోకుండా రచ్చరచ్చ చేశాడు. చివరకు టీడీపీ కార్యకర్తలు కూడా తిరగబడటంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత సోమిరెడ్డి గ్రామంలో పర్యటిస్తూ గుడిలో పూజలు నిర్వహించి బయటకు వస్తుండగా వెంకటయ్య గడ్డపార తీసుకొని అక్కడికి వచ్చాడు. గడ్డపారను తిప్పుతూ వీరంగం సృష్టించాడు. సోమిరెడ్డిపైకి దూసుకొచ్చేందుకు ప్రయత్నించగా టీడీపీ కార్యకర్తలు అడ్డుకొని వెంకటయ్యకు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన ఒక్కసారిగా గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. అక్కడి నుంచే సోమిరెడ్డి జరిగిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు గ్రామానికి చేరుకున్నారు. ఆ తర్వాత కార్యక్రమాన్ని సోమిరెడ్డి ప్రశాంతంగా ముగించారు. అయితే ఈ కార్యక్రమం ముగిశాక వైసీపీ నాయకులు వెంకటయ్య చేత పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 11 మంది టీడీపీ కార్యకర్తలపై హత్యాయత్నం కేసు(సెక్షన్ 307) నమోదు చేసినట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం దీనిని బయటకు చెప్పడం లేదు. ఫిర్యాదిదారుడిని ఆసుపత్రికి తరలించామని, వైద్యుల రిపోర్టు ప్రకారం కేసు నమోదు చేస్తామని చెబుతున్నారు. అయితే వీరంగం సృష్టించిన వెంకటయ్యపై నెల్లూరు జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిసింది.

మూగ జీవాల దాహార్తి తీరేదెలా?

» గ్రామాల్లో శిథిలమైన నీటి తొట్లు » కొత్తవి నిర్మించాలంటున్న రైతులు » జిల్లాలో 17.88 లక్షల పశువులు

రాజోలి, ఫిబ్రవరి 26 : రానున్న వేసవిలో మూగ జీవాలకు తాగునీరు కరువయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం జిల్లాలో మొత్తం 17.88 లక్షల పశు సంపద ఉంది. అందులో 76,000 గోజాతి పశువులు, 59,000 గేదె జాతి పశువులు, 5.77 లక్షల గొర్రెలు, 68,000 మేకలు ఉన్నాయి. అలాగే 1.97 లక్షల దేశవాళీ కోళ్లు, 8.11 లక్షల ఫారం కోళ్లు ఉన్నట్లు చెబుతున్నాయి. అయితే రాజోలి మండలంలో ఆవులు, ఎద్దులు 4,690, గేదెలు 6,869, గొర్రెలు 25,078 కోళ్లు 12,000 వరకు ఉన్నాయి. పాడి రైతులు తమ పశువులతో ఇంటి నుంచి పొలం పనులకు, మేత మేపేందుకు బయలుదేరితే, మళ్లీ ఇంటికి తిరిగి వచ్చే వరకు పశువులకు నీరు దొరకడం కష్టమయ్యే పరిస్థితి ఉందని రైతులు చెప్తున్నారు. దారిలో నీరు తాపేందుకు తొట్లు కానీ, సంపులు కానీ లేవని అంటున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న రాజోలిలో నిర్మించిన నీటి తొట్టి

అధికారులతో చర్చిస్తాం

నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లను అందుబాటులోకి తీసుకొస్తే పశువులకు తాగునీటి కొరత ఉండదు. అలాగే శిథిలావస్థలో ఉన్న తొట్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ విషయంపై సంబంధిత అధికారులతో చర్చించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ వెంకటేశ్వర్లు,
జిల్లా పశువైద్య అధికారి :

15 ఏళ్ల క్రితం నీటితొట్ల నిర్మాణం

పశువుల దాహార్తి తీర్చడం కోసం వాటర్‌షెడ్ పథకం కింద 15 సంవత్సరాల క్రితం ఒక్కో నీటి తొట్టికి రూ. 12 వేలు వెచ్చించి, అలంపూర్ నియోజకవర్గంలోని 100 గ్రామ పంచాయతీల్లో 250కి పైగా నీటి తొట్లు నిర్మించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడం, పర్యవేక్షణ లేకపోవడంతో అవి శిథిలమయ్యాయి. కొన్నిచోట్ల నీటి సరఫరా లేక వృథాగా మారాయి. ఆ తర్వాత ఇప్పటివరకు నీటితొట్ల నిర్మాణం, మరమ్మతు పట్టించుకున్న వారు లేరు. దీంతో రైతులు ఎంతో దూరం నుంచి బిందెలతో నీటిని మోసుకొచ్చి పశువుల దాహార్తిని తీర్చాల్సి వస్తోంది. అందుబాటులో నీరు లేక కుంటల్లో, కాలువల్లో నిలిచిన మురుగు నీటిని తాగు పశువులు వ్యాధుల బారిన పడుతున్నాయని రైతులు చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశువుల సంచారం ఎక్కువగా ఉండే దగ్గర నీటి తొట్లు, సంపులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నీటి తొట్లు లేక ఇబ్బందులు

కుర్వ వెంకటస్వామి, రైతు, రాజోలి :



పశువులను పొలానికి తీసుకెళ్లేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు వాటి దాహం తీర్చేందుకు చాలా ఇబ్బందులు పడ్తున్నాము. పశువులు ఎక్కువగా సంచరించే ప్రదేశంలో, మేకలు మేత మేసే దగ్గర నీటి తొట్లు ఏర్పాటు చేయాలి. నీరు అందుబాటులో లేక అవి పైపులైన్ లీకేజీలు, కుంటల్లో నిలిచిన మురుగు నీటిని తాగుతున్నాయి. కలుషిత నీరు తాగడం వల్ల అవి అనారోగ్యానికి గురవుతున్నాయి.

నీటితొట్లు నిర్మించాలి

బి.నాగరాజు, రైతు, రాజోలి : ఎండలు



తీవ్రమవుతుండటంతో పశువుల దాహార్తిని తీర్చలేక ఇబ్బంది పడ్తున్నాం. వేల రూపాయలు వెచ్చించి తెచ్చుకున్న పశువులు నీరు లేక వడదెబ్బకు గురై చనిపోతున్నాయి. గతంలో అక్కడక్కడ ఉండే తొట్లలో నీరు పశువులు దాహార్తిని తీర్చుకునేవి. అవి శిథిలం కావడంతో వాటికి తాగునీరు దొరకడం లేదు. ప్రభుత్వం స్పందించి అవసరమైన ప్రాంతాల్లో నీటి తొట్లు నిర్మించాలి.

ఆకట్టుకున్న చింతామణి నాటక ప్రదర్శన



దేవునితిర్మలాపూర్ గ్రామంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్నను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 26 : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన భక్తచింతామణి నాటక ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా నాగర్‌కర్నూల్ కళా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన చింతామణి నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఎమ్మెల్సీ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత గోరటి వెంకన్న బిల్వ మంగళుడు పాత్ర పోషించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం గోరటి వెంకన్నను ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, ఆ గ్రామ మాజీ సర్పంచ్ వి.సత్యంలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ రవికుమార్, మాజీ ఎంపీపీ వేంకటేశ్వర్‌రావు, గ్రామ ఉప సర్పంచ్ వి.శ్రీనివాసులు, సింగిల్ విండో మాజీ చైర్మన్ డి.బాలస్వామి, కాంగ్రెస్ నాయకులు మేకల చంద్రయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎస్ విధానం రద్దు చేయాలి'

వంగూరు, ఫిబ్రవరి 26: రాబోయే పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు చిన్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీపీఎస్ రద్దు కోసం రెండు లక్షల సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలు ఎదురు చూస్తున్నాయన్నారు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటూనే బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పది సంవత్సరాలు సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా మోసం చేసిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాబోయే పార్లమెంట్ ఎన్నికలలోపే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

సంచుల తయారీతో ఉపాధి

- లబ్ధిపొందుతున్న చెంచులు

- ఏటీఆర్ ఆధ్వర్యంలో సంచుల తయారీ కేంద్రం



జనపనార సంచులను తయారు చేస్తున్న చెంచు మహిళలు

మన్ననూర్, ఫిబ్రవరి 26: రోజురోజుకూ ప్లాస్టిక్ కవర్ల వాడకం పెరుగుతోంది... ప్లాస్టిక్ లేని గ్రామాలు, పట్టణాలు నేడు కరువయ్యాయి. ప్లాస్టిక్ సంచులు విచ్చలవిడిగా వాడడం వలన మానవులకు క్యాన్సర్ తదితర భయానక వ్యాధులు సోకుతున్నాయి. శ్రీశైలం వెళ్లే యాత్రికులు నల్లమల అభయారణ్య ప్రాంతం నుంచే వెళ్తుంటారు. వారు వాడేసిన ప్లాస్టిక్ కవర్లను నల్లమల రహదారిపై ఎక్కడ పడితే అక్కడ పడేస్తుంటారు. ప్లాస్టిక్ కవర్లను తిని వన్యప్రాణులు అనారోగ్యం బారినపడుతుంటాయి. నల్లమల సఫారీ టూర్ నిమిత్తం మన్ననూరు కాటేజీల్లో బస చేసే పర్యాటకులకు ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను వివరించడంతో పాటుగా జనపనార సంచులను వాడడం వలన కలిగే లాభాలను వివరిస్తూ ఏటీఆర్ స్టాల్ ద్వారా అటవీశాఖ సిబ్బంది జనపనారతో తయారు చేసిన గృహోపకరణ సంచులను విక్రయిస్తున్నారు.

జనపనార సంచుల తయారీ

అటవీ సమీప గ్రామాల చెంచు యువ మహిళలకు అపోలో ఫౌండేషన్ వారి సహకారంతో కుట్టు మిషన్ నేర్పించారు. మిషన్ గృహోపకరణ బ్యాగుల తయారీపై తర్ఫీదునిచ్చి బ్యాగులను తయారు చేస్తున్నారు. కేంద్రంలో 15 మంది మహిళలు జనపనార సంచులను తయారు చేస్తున్నారు. ఒక్కో మహిళ రోజుకు 10 బ్యాగుల చొప్పున తయారు చేస్తున్నారు. ప్రతీ సంచిపై అమ్రాబాద్ పులుల అభయారణ్య లోగో కనిపించేలా తయారు చేస్తున్నారు. ఒక్కో మహిళకు రూ.6 వేలు నెల వేతనం చెల్లిస్తూనే తయారు చేసే బ్యాగులను బట్టి ధర కట్టిస్తున్నారు. ఒక్కో చెంచు మహిళ రూ.10 వేలకు పైగా ఈ కేంద్రం ద్వారా ఆదాయం పొందుతున్నారు. నల్లమలలో తయారైన జనపనార సంచులను హైదరాబాద్‌లోని పలు దర్శనీయ స్థలాల్లోనూ విక్రయించేందుకు అక్కడి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో సంచి రూ. 80 నుంచి 450 వరకు ధర నిర్ణయించారు.

తయారయ్యే సంచులివే...

జూట్ బ్యాగ్, హాండ్ బ్యాగ్, టిఫిన్ క్యారేజ్ బ్యాగ్, షేపింగ్ బ్యాగ్, ల్యాబ్ టాబ్ బ్యాగ్, మహిళలు వాడే పర్సులు, టేబుల్ మ్యాట్, ఫైల్ బ్యాగ్

రోజుకు 10 బ్యాగులను తయారు చేస్తాను

మాది మారుమూల లోతట్టు అటవీ ప్రాంతం కొమ్మన పెంట. తమకు అటవీ శాఖ కుట్టు మి షన్ పై శిక్షణ ఇచ్చి జనపనార సంచులను తయారీ చేయిస్తూ ఉండడం వలన తాము ప్రయో జకులయ్యాం. రోజుకు 10 బ్యాగులను తయారు చేస్తాను. మున్ముందు మరిన్ని కొత్త రకం బ్యా గులు కుట్టేందుకు శిక్షణ ఇప్పించాలి. నెలకు 10 వేలు సంపాదించడం కుటుంబానికి ఆసరాగా ఉంది.



- సంధ్య , కొమ్మన పెంట

శిక్షణలు వెలుగులు నింపుతాయి



ఇలాంటి శిక్షణలను మరింత మంది చెంచులకు అందించాలి. తమకు అటవీ ఉత్పత్తులు, ఉపాధి హామీ పనులు చేస్తేనే ఆసరాగా ఉండేది. ఇలాంటి నైపుణ్య శిక్షణలు మహిళల జీవితానికి వెలుగులు నింపుతాయి. మగవాళ్లు అటవీ వాచర్లు, ఉపాధి హామీ పనులకు వెళ్లడం చేస్తూ ఉంటే తాము ఇలాంటి కుట్లు, అల్లికల ద్వారా డబ్బులను సంపాదించడం వలన తమకు ఆర్థిక వనరులు సమకూరు తాయి. తమ పిల్లలను ఉన్నత విద్య అందించేందుకు డబ్బు ఉపయోగపడుతుంది.

- నారాయణమ్మ, మాచారం చెంచు కాలనీ

అభయారణ్య ప్రాంతాల్లోనూ ప్రదర్శిస్తున్నాం



ప్లాసిక్ వాడకం నిషేధించాలనే ఉద్దేశంతోనే ఏటీఆర్ ఆధ్వర్యంలో జనపనార బ్యాగులను తయారు చేసే ప్రక్రియను స్థానిక డీఎఫ్‌వో రోహిత్ గోపిడి ఆలోచన మేరకు అపోలో ఫౌండేషన్ ద్వారా ఈ బ్యాగుల తయారీ కేంద్రం ఏర్పాటు చేశాం. ఇక్కడికి వచ్చే పర్యాటకు లకు జనపనార బ్యాగులను నిత్య జీవితంలో వాడాల్సిన అవసరాన్ని ఎడ్యుకేట్ చేస్తున్నాం. ఏటీఆర్‌లో తయారు చేసే జనపనార సంచులను ఇతర అభయారణ్య ప్రాంతాల్లోనూ ప్రదర్శిస్తున్నాం.

ఈ కేంద్రం వలన స్థానిక చెంచు మహిళలకు ఉపాధి లభించడంతో పాటుగా పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లుగా మొదటి అడుగు వేశాం. రాబోయే రోజుల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించి ప్రత్యామ్నాయ మార్గాలు ప్రజలు ఎలా ఎంచుకోవాలనే మార్గాలను ఏటీఆర్‌లో తయారు చేస్తున్నాం.

- శ్వేత, అటవీ విద్యాధికారి, అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం

ఆలయాల అభివృద్ధికి సహకారం



మన్ననూరు వేణుగోపాల స్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న దాక్టర్ అనూరాధ

మన్ననూర్, ఫిబ్రవరి 26: అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు వేణుగోపాలస్వామి, ముదిరాజ్‌ల కుదేవత ఎల్లమ్మ ఆలయాల వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల మొక్కును తీర్చుకోవడంలో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తల ఆహ్వానం మేరకు మన్ననూరు కు వచ్చి కొబ్బరి కాయలు కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. వేణుగోపాల స్వామి ఆలయం జీర్ణావస్థ దశలో ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రామానుజా చార్యుల వార్షికోత్సవం సందర్భంగా సమతా దీక్ష చేపట్టిన రుక్మిణి మహిళా సంఘం సభ్యులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు సంబు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, శివాజీ, పంబలి బుచ్చయ్య, రాజు, శోభ, జయమ్మ, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

రైతుల పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు



నాగర్‌కర్నూల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 26: పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించి వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ అన్నారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రైతుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించిన రైతు వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేసి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, కేశవులుగౌడ్, జిల్లా నాయకులు టి.నరసింహ, టి.విజయుడు, కృష్ణాజీ, బాలమురళీకృష్ణ, మారేడు శివశంకర్, మధుగౌడ్, వెంకటమ్మ, కురుమయ్య, కేశవులు, కొత్త శేఖర్, రాధాకృష్ణ, మద్దిలేటి, శివకృష్ణ, బాలపీరు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవిలో చెట్లు నరికిన మహిళపై కేసు నమోదు

కొల్లాపూర్, ఫిబ్రవరి 26 : కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు బీట్ అమరగిరి సెక్షన్ కొల్లాపూర్ రేంజ్ పరిధిలోని అడవిలో చెట్టు నరికి అడవిని చదును చేసేందుకు యత్నిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సోమవారం ఫారెస్టు రేంజర్ శరత్‌చంద్రారెడ్డి పేర్కొన్నారు. కొల్లాపూర్ మండల పరిధిలోని నార్లపూర్ గ్రామానికి చెందిన పడావత్ శాంతమ్మ భర్త పడావత్ ధర్మ అనే మహిళ అడవిలోకి ప్రవేశించి చెట్లను నరికి భూమి చదును చేస్తుందని తెలుసుకుని అటవీ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అటవీ చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగిందని రేంజర్ తెలిపారు. ఫారెస్టు అధికారులు మహిళను విచారణ చేయగా ప్రభుత్వం కొత్తగా అడవి హక్కు పత్రాలిస్తుందనుకుని అడవి చెట్లను నరికానని ఆ మహిళ అధికారులతో పేర్కొంది. ఫారెస్టు అధికారులు ఆ మహిళను రెవెన్యూ అధికారుల వద్ద బైండోవర్ చేశారు. 2005 సంవత్సరం కంటే ముందే భూమిలో హక్కుదారులుగా ఉన్న వారికి మాత్రమే అటవీ హక్కు పత్రాలు వస్తాయని, ఇప్పుడు కొత్తగా అడవిని ఆక్రమించిన వారికి ఎలాంటి హక్కు పత్రాలు రావని, అలాంటి వ్యక్తులపై అటవీ హక్కు చట్టం ప్రకారం కేసు నమోదై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రేంజర్ శరత్‌చంద్రారెడ్డి తెలిపారు.

నల్లమలలో పూరిల్లు దగ్ధం

రూ.50 వేల నగదు, గృహోపకరణాలు అగ్నికి ఆహుతి


దగ్ధమైన ఇంటి ఆవరణలో మల్లికార్జున దంపతులు

మన్ననూర్, ఫిబ్రవరి 26: నల్లమల అభయారణ్య ప్రాంతంలోని సంగిడి గుండాల చెంచు పెంటలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. ఈ విషయం సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఏటీఆర్ డివిజన్‌లోని గల సంగిడి గుండాల పెంటలో నివాసం ఉండే చెంచులంతా 2 కిలోమీటర్ల దూరంలో గల అభయారణ్యంలో ఉపాధి హామీ పనుల నిమిత్తం వెళ్లారు. చెంచుల్లో తోకల మల్లికార్జున, భార్య అను, తల్లి నాగమ్మ కలిసి తమ పూరి గుడిసెకు తాళం వేసి వెళ్లగా , ఆదివారం 4 గంటల సమయంలో అడవికి ఆనుకుని ఉన్నటువంటి పూరిల్లు సమీపంలోని గడ్డి నిప్పురవ్వలు రాజుకొని మంటలు ఎగిసి పడ్డాయి. చెంచులంతా సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి పూరి గుడిసె మొత్తం కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో రూ.50వేల నగదు, ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు ఖాతా బుక్కులు, తింగి గింజనులు, దుస్తులు, గృహోపకరణాలు మొత్తం కాలిపోయాయని బాధితుడు మల్లికార్జున తెలిపారు. నిరాశ్రయులైన తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ మన్ననూరులోని ఐటీడీఏ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు.

'స్వాతంత్ర్య వీరులకు స్ఫూర్తి నింపిన వీరుడు వినాయక్ దామోదర్ సావర్కర్'

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 26: స్వాతంత్ర్య వీరులకు స్ఫూర్తి రగిలించిన వీరుడు వినాయక్ దామోదర్ సావర్కర్ అని బీజేపీ సీనియర్ నాయకుడు రంగినేని రవీందర్ అన్నారు. వినాయక్ దామోదర్ సావర్కర్ వర్ధంతి పురస్కరించుకొని సోమవారం పట్టణంలోకార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తన రచనలతో ఉద్యమానికి కొత్త ఊపిరినిచ్చిన మాతృభూమి కోసం పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు.

కలెక్టరేట్ ప్రజావాణికి 28 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 26: నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రజావాణికి ఈ వారం 28 ఫిర్యాదులు అందాయి. 17 ధరణికి సంబంధించిన సమస్యలే ఉన్నాయి. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన వినతులను జడ్పీ సీఈవో దేవ సహాయం, స్పెషల్ అదనపు కలెక్టర్ కెఎల్‌ఐ అరుణరెడ్డి స్వీకరించారు. వినతులను పరిశీలించిన అనంతరం విచారణ కోసం సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, సీపీవో భూపాల్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 11ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ సముదాయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 11 ఫిర్యాదులు వచ్చినట్లు అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా తగు న్యాయం గురించి ఆరు ఫిర్యాదులు, భూమిపంచాయతీలకు సంబంధించి మూడు ఫిర్యాదులు, భార్యభర్త గొడవలకు సంబంధించి రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ ఆదేశించారు.

పెద్దమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ప్రారంభం

వెల్దండ, ఫిబ్రవరి 26 : మండల పరిధిలోని భైరాపూర్ గ్రామంలో పెద్దమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ప్రారంభమయ్యింది. నాలుగు రోజులపాటు జరిగే కార్యక్రమంలో భాగంగా గణపతిపూజ మొదలయ్యింది. 27న గణపతి పూజ, హోమాలు, 28న పెద్దమ్మతల్లి, పోతురాజు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన, 29న బోనాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డీజిల్ నీరొచ్చిందని వినియోగదారుడి ఆందోళన

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని టెలిఫోన్ ఎక్ఛేంజ్ సమీపంలోని పెట్రోల్‌బంకులో డీజిల్ పోయించుకుంటే నీరొచ్చిందని వినియోగదారుడు నరేందర్‌రెడ్డి పెట్రోల్ బంకు ముందు సోమవారం ఆందోళన నిర్వహించారు. తాను డీజిల్ పోయించుకుని తన వాహనాన్ని తీసుకెళ్లగా కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఆగిపోయిందని తీరా విప్పి చూస్తే నీరొచ్చిందని పేర్కొన్నారు. దీంతో తన వాహనం మొరాయించిందని అన్నారు.

'అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా'

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 26: గృహ వినియోగదారులు, రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నిరంతరం అందిస్తున్నామని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ లీలావలి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ లీలావతి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ వినియోగంలో ఎక్కడైనా అనధికారిక అంతరాయం ఏర్పడితే ప్రజలు మా దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ డీఈ శ్రీధర్‌శెట్టి, ఏడీఈ ఆదిశేషు, ఈఈ కృష్ణగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల ఏర్పాటుకు మౌఖిక పరీక్ష

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 26: జిల్లాలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి, తాడూరు మండల కేంద్రం, కోడేరు మండలం మైలారం, తీగలపల్లి గ్రామాల్లో మీసేవ కేంద్రాల ఏర్పాటుకు సోమవారం మౌఖిక పరీక్షలు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో నిర్వహించిన మౌఖిక పరీక్షలకు పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిలో 12 మంది అభ్యర్థులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆమోదంతో తుది ఫలితాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ కార్తీక్, సీపీవో భూపాల్‌రెడ్డి, ఈడీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంత్‌సేవాలాల్ మహారాజ్ గొప్ప ఆధ్యాత్మిక వేత్త

- జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల, ఫిబ్రవరి 26: సంత్‌సేవాలాల్ మహారాజ్ దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త అని అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం శ్రీసంత్‌సేవాలాల్ 285 జయంతి ఉత్సవాలను లింగాలలో ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా బావోజీలు, మహిళలు, యువకులు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను స్వాగతం పలుకుతూ చేపట్టిన భారీ ర్యాలీ ప్రధాన వీధులగుండా సాగి మేరమ్మ ఆలయానికి చేరుకుంది. బంజారుల సాంప్రదాయ బద్ధంగా భోగ్ బండార్‌ను సమర్పించిన అనంతరం ఆయన మేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారుల సంస్కృతి, సంప్రదాయల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని, బంజారుల భగవాన్ స్వరూపుడైన సంత్ సేవాలాల్ గొప్ప సంఘ సేవకుడని ఆయన చేసిన సేవలను కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి బంజారుల పట్ల అపారమైన గౌరవం ఉందని, అందుకే సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటిస్తూ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి లంబాడీ గిరిజనుల పట్ల ప్రేమను చాటుకున్నారని అన్నారు. అనంతరం ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించి క్రీడా పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. జడ్పీటీసీ సభ్యురాలు నేజమ్మ, మద్దిమడుగు పీఠాదిపతి జయరాం గురుస్వామి, నిర్వాహకులు శంకర్‌రాథోడ్, రాజునాయక్, బాలాజీ, భద్రునాయక్, కిషన్‌లాల్, హన్మంతునాయక్, కిషన్‌నాయక్, దేవేందర్‌నాయక్, రాంజీనాయక్, బాలుబావోజీ, మోతిరాం, శివ పవన్‌రాజ్, శషిదర్, రమేష్, వెంకట్‌లాల్, బాల్‌రాజు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వచ్చిన తరువాతనే కాంగ్రెస్‌కు జవసత్వాలు

అచ్చంపేట: రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పగ్గాలు తీసుకున్న తరువాతనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు వచ్చాయని, ఎన్నికల ముందు తమ పార్టీ గెలుస్తుందని చెప్పిన వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్ అని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేట పట్టణంలోని తన నివాస గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ సభలో ఆ పార్టీ నాయకుడు కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు అర్ధ రహితం అన్నారు. రేవంత్‌రెడ్డిని చూడాలంటేనే ఎందుకు కేసీఆర్‌కు, కేటీఆర్‌కు భయం అని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపైన విమర్శలు చేసి లబ్ధిపొందాలనుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కారు షెడ్‌కు చేరుకుంది. పాతాళానికి చేరుకున్న పార్టీ పైకి లేపడం ఎవరి తరం కాదన్నారు. గతంలో వేసిన శిలాఫలకాల గురించి ప్రజలకు వివరించకుండా రెండు నెలలు దాటిన ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోపతయ్య, రాజేందర్, రఘురాం, గోపాల్‌రెడ్డి, శేఖర్, కొయ్యల శ్రీనివాసులు, తిరుపతయ్యగౌడ్, భరత్‌కుమార్, రాజగోపాల్, మహబూబ్‌అలీ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీకి భూమి పూజ

● అమ్రాబాద్: అచ్చంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వెల్లడించారు. సోమవారం రాత్రి తన సొంత గ్రామం ఎల్లపల్లిలో ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ, ఆలయ ప్రహరీల నిర్మాణం కోసం ప్రభుత్వం ద్వారా రూ.60 లక్షలు మంజూరు కావడంతో ఈ సందర్భంగా భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయనను ఈ సందర్భంగా గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.

పాత పద్ధతిలో అంగన్‌వాడీ ప్రమోషన్లు ఇవ్వాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు

కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ హెల్పర్లు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 26: అంగన్‌వాడీ హెల్పర్లకు ప్రమోషన్ల విషయంలో ఇంటర్ విద్యార్హత నిర్ణయిస్తే సీనియారిటీ కలిగిన చాలా మంది హెల్పర్లు అర్హత కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రమోషన్లకు ఎస్ఎస్‌సీనే విద్యార్హతగా నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ హెల్పర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల రామయ్య, కోశాధికారి అశోక్, అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ నాయకులు సరిత, కృష్ణవేణి, లక్ష్మీ, స్వప్న, వెంకటమ్మ, భారతమ్మ, అలివేల తదితరులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలుగా విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులకు పదవ తరగతి అర్హత పరీక్ష ఉత్తీర్ణతతోనే ఉపాధ్యాయురాలిగా(మినీ టీచర్) పదోన్నతులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు అంగన్‌వాడీ ఆయాలచే సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో డీఏవో జమీల్‌కు సీఐటీయూ నాయకులు అందజేశారు. అంగన్‌వాడీ ఆయాలు దేవి, ఈశ్వరమ్మ, వసంత, వెంకటమ్మ, పోచమ్మ, గంగమ్మ, లక్ష్మీ, రజిత తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి : అంగన్‌వాడీ ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయాలు సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏవోకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వెంకటయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు చంద్రకళ, మున్నీ, నాగమ్మ, రాధ, సుభద్ర, రాముల మ్మ, శారదా, సంతోష, జంగమ్మ, లక్ష్మమ్మ, పద్మ, స్వాతి తదితరులు ఉన్నారు.

మునిసిపల్ బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

- హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి



మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 26: నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ 2024-25 వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం పొందింది. సోమవారం మునిసిపల్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ కల్పన అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డితో పాటు 22 మంది కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కాగా ఇద్దరు కౌన్సిలర్లు గైర్హాజరు అయ్యారు. మొత్తం రూ.783.10 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్ కౌన్సిల్ ఆమోదం పొందింది. వార్షిక బడ్జెట్‌లో ఆదాయం కింద ఆస్తి పన్ను రూ.417.00 లక్షలు, పన్నేతర ఆదాయం రూ.316.10 లక్షలు, ఇతర గ్రాంట్లు రూ.100.00 లక్షలు, డిపాజిట్స్ అండ్ లోన్స్ రూ.5.00 లక్షలు రూపొందించారు. అదేవిధంగా వార్షిక బడ్జెట్‌లో వివిధ పద్దుల కింద అంతే మొత్తంలో ఖర్చులను చూపారు. మునిసిపల్ వైస్ చైర్మన్ బాబురావు, మునిసిపల్ కమిషనర్ నరేష్ బాబు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తా

తాడూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలను రానున్న రోజుల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన సీసీ రోడ్డునిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడూరు మండల కేంద్రానికి 50లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులను మంజూరు చేశామని కొద్దిరోజుల్లో అందుకు సంబంధించిన పనులన్నీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పలు శుభకార్యాలకు హాజరై కాంగ్రెస్ కార్యకర్త కోటయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యురాలు రోహిణి, ఎంపీటీసీ రేణుక, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య , కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తాడూరుమండలంలోని ఇంద్రకల్, పాపగల్, పొల్మూరు, సిర్సవాడ, తుమ్మలసూగురు, యత్మతాపూర్ గ్రామాలకు చెందిన ఆరు మంది లబ్ధిదారులకు సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆర్ఐ గోపాలకృష్ణ, లబ్ధిదారులు ఉన్నారు.

తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు

కందనూలు: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మిషన్‌భగీరథ శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులతో చర్చించి నీటి సరఫరాకు సంబంధించిన అంశాలను చర్చించారు. రాబోయే వేసవిలో ఎట్టి పరిస్థితిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించి సరఫరా చేయాలని ఆదేశించారు. మిషన్‌భగీరథ ఈఈ సుధాకర్‌సింగ్, డీఈఈలు సురేష్ కుమార్, భరత్‌సింహారెడ్డి, ఏఈఈలు జిలానీ, వినోద్‌నాయక్, ఏజెన్సీ నండి జీఎం ప్రకాశ్, వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ ఆశయాలకనుగుణంగా స్వరాష్ట్రంలో పాలన

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

- కల్వకుర్తిలో గద్దర్ సంస్మరణ సభ


గద్దర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, గద్దర్ కూతురు వెన్నెల

కల్వకుర్తి, ఫిబ్రవరి 26 : ప్రజాయుద్ధనౌక గద్దర్ ఆశయాలకనుగుణంగా రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కులమతాలకతీతంగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం గద్దర్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, గద్దర్ కూతురు వెన్నెల, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, జీజేసీ ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి, పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్దర్ మాట, పాటలో సమస్యలను ఎత్తిచూపుతూ దౌర్జన్యాలను, అన్యాయాలను ఎదిరించేలా ఉండేవన్నారు. ప్రాణత్యాగానికి సైతం సిద్ధమై ప్రజల కోసం పని చేసిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజా ధనాన్ని వృథా చేసిందని, రూ.8లక్షల కోట్లు అప్పు మిగిల్చిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం ప్రభుత్వం విడుదల చేసిందని, అందులో 93వేల కోట్లు ఖర్చు చేసి కేవలం 98వేల ఎకరాలకు సాగు నీరందిస్తున్నట్లు పేర్కొన్నారు. గద్దర్ పేరున సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నంది అవార్డులు ఇచ్చేందుకు ప్రకటించడం అభినందనీయమన్నారు. కులమతాలకతీతంగా అభివృద్ధే లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

● అణిచివేసిన చోటే తిరుగుబాటు: వెన్నెల

ఎక్కడైతే అణిచివేత ఉంటుందో అక్కడే తిరుగుబాటు ఉంటుందని ప్రజాయుద్ధనౌక గద్దర్ కూతురు వెన్నెల తెలిపారు. సామాన్య ప్రజలు తిండి, గుడ్డు, గుడ్డ ఉంటే చాలని సర్దుకుని బతుకుతున్న వారిని కూడా ఇబ్బంది పెడితేనే తిరుగుబాటు వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2023 ఎన్నికల్లో తిరుగుబాటు చేసి గత ప్రభుత్వాన్ని మార్చారని గుర్తు చేశారు. మహానుభావులు మరణించారని వారి ఆశయాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. ఓటు ద్వారా మార్పు వస్తుందని నిజమైన వారికి మాత్రమే ఓటు వేయాలన్నారు. అనంతరం గద్దర్‌పై ఆమె పాట పాడి ఆకట్టుకున్నారు. అనంతరం జడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్, కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడారు. నిర్వాహకులు గోపాల్, శేఖర్, సైదులు యాదవ్, మాలిక్, అంజిముదిరాజ్, జగన్, అబ్దుల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సదానందంగౌడ్, రాంపర్వతాలు, శ్రీనివాసులు, ఆంజనేయులు, రాజేందర్, బాలయ్య, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల కల్లబొల్లి మాటలు నమ్మొద్దు

- బీజేపీ విజయ సంకల్పయాత్రలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి


కొల్లాపూర్‌లో బీజేపీ విజయ సంకల్పయాత్రలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి

కొల్లాపూర్, ఫిబ్రవరి 26 : తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మవద్దని బీజేపీతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో దేశం అభివృద్ధి అవుతుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న విజయ సంకల్పయాత్ర సోమవారం సాయంత్రం కొల్లాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన విజయ సంకల్పయాత్ర కొనసాగింది. కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడి కొల్లాపూర్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలు అమలవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కొల్లాపూర్‌లో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేటికీ భూమి సమకూర్చడం లేదన్నారు. ఎంపీ ఎన్నికల తర్వాత కొల్లాపూర్‌లో మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల కష్టాలు తీరుస్తామన్నారు. అదేవిధంగా మామిడి నిల్వలు చేసేలా కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేస్తామని, కొల్లాపూర్ నల్లమలలో విస్తారంగా లభించే వెదురు, సున్నపు రాయితో పేపర్ సిమెంట్ పరిశ్రమ నెలకొల్పుతామని వెంకటరమణారెడ్డి హామీ ఇచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించడంతోనే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు ఎంతో అభివృద్ధి సాధిస్తాయని ఆయన పేర్కొన్నారు. కాగా, 2018 ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా తాను పోటీ చేసి ఓడినా కొల్లాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎల్లేని సుధాకర్‌రావు పోటీ చేసిన ఓటమిపాలైన అభివృద్ధే లక్ష్యంగా పని చేశామని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి అన్నారు.

● కుటుంబ పార్టీలతో ఒరిగేదేమీ లేదు

కుటుంబ పాలన కొనసాగించే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో దేశానికి, ఇటు రాష్ట్రానికి ఒరిగేదేమి లేదని నాగర్‌కర్నూల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పేర్కొన్నారు. గడిచిన ఎన్నికల్లో మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పిన హామీలను ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని ఆయన ఎద్దేవా చేశారు.

దేశంలో మూడవసారి ప్రపంచం మొత్తం మెచ్చిన నాయకుడు నరేంద్రమోదీ ప్రధాని కాబోతున్నారని, కేంద్రంలో 400ఎంపీ సీట్లతో బీజేపీ అధికారంలోకి రాబోతుందని ఎల్లేని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్‌కు సన్మానం


కల్యాణ్‌నాయక్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 26 : బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ కల్యాణ్‌నాయక్‌ను బీజేపీ నాయకులు సన్మానించారు. కల్వకుర్తి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో అయోధ్య బాలరాముని చిత్రపటం బహూకరించి శాలువాతో సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, బీజేపీ నాయకులు నరసింహ, రాఘవేందర్‌గౌడ్, రవిగౌడ్, వివేకానంద, నరేష్‌గౌడ్, చందు, రాంరెడ్డి, శివ, చింటు, సాయి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

చారకొండ, ఫిబ్రవరి 26: మండలంలో ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కేసీ ప్రమీల అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తహసీల్దార్ పేర్కొన్నారు. నాయబ్ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, వీఎల్‌వో షెక్‌మదర్, సీహెచ్‌వో సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

ఊర్కొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చెన్నకిష్టన్న అన్నారు. ప్రజావాణి సందర్భంగా మండలంలో ఉన్న ప్రతీ అధికారి అందుబాటులో ఉంటారని ప్రజలు తమ సమస్యలు తెలియజేసుకొని సమస్య పరిష్కరించుకోవాలని తెలిపారు.

'గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం'

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 26 : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మారేడుమానుదిన్నె గ్రామంలో 17లక్షల 50వేల రూపాయలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. మాజీ సర్పంచ్‌లు అరవింద్, బాలునాయక్, జడ్పీటీసీ సభ్యురాలు మంగమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటస్వామిగౌడ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీధర్‌రావు, కాంగ్రెస్ నాయకులు కేతావత్ శంకర్‌నాయక్, జగన్మోహన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

మోపా జిల్లా అధ్యక్షుడిగా లోకేశ్



బిజినేపల్లి, ఫిబ్రవరి 25: నాగర్‌కర్నూల్ జిల్లా ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ అధ్యక్షుడిగా కొంకలి లోకేశ్వర్ ముదిరాజ్‌ను ఎన్నుకున్నట్లు ఆయన సోమవారం తెలిపారు. బిజినేపల్లి మండలం పాలెం గ్రామానికి చెందిన జిల్లా అధ్యక్షుడు కొంకలి లోకేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారుగా 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ కులస్థులు సరైన రిజర్వేషన్లకు నోచుకోవడం లేదని వెంటనే బీసీడీ గ్రూప్ నుండి బీసీఏ గ్రూప్‌కులోకి మార్చడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమయాని సద్వినియోగం చేసుకోవాలి

బిజినేపల్లి, ఫిబ్రవరి 25 : పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఉన్న 20 రోజుల సమయాని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో గోవిందరాజులు అన్నారు. మండలంలోని పాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులు వెనకబడిన సబ్జెక్టుల సిలబస్‌ను ఏకాగ్రతతో పునఃశ్చరణ చేసుకొని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు, చంద్రమోహన్ రెడ్డి, పూర్ణ, చంద్రకళ తదితరులు ఉన్నారు.

ఘనంగా శివస్వాముల పడిపూజ

వంగూరు, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివస్వాముల పడిపూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య సాగిన పూజలు భక్తిని చాటాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ, వారి సతీమణి అనురాధ హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శివమాలల ధరించిన స్వాములను అభినందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజను తిలకించారు. వెంకటేష్, జనార్దన్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల ధర్నా

వెల్దండ, ఫిబ్రవరి 26 : కొత్త సమీపంలోని శాస్త్ర ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం పాఠశాల ఎదుట విద్యార్థి నాయకులు ఆందోళన చేపట్టారు. పాఠశాలలోని విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పాఠశాల ఉపాధ్యాయులకు సరైన సమయంలో వేతనాలు చెల్లించకుండా అడిగిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. విద్యను వ్యాపారంగా మారుస్తున్న పాఠశాల యాజమాన్యంపై ఎంఈవో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంతోష్, రాహుల్, మహేష్, పర్వతాలు, మహేందర్, దేవ్‌సింగ్‌లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ పండుగ

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 26 : తిమ్మాజిపేట మండల పరిధిలోని గుమ్మకొండలో సోమవారం ఎంతో భక్తిశ్రద్ధలతో రేణుక ఎల్లమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ మల్లయ్య దేవతామూర్తులను ఊరు వెలపల ఉన్న బోరు బావి దగ్గర జలంతో శుద్ధిచేసి డప్పుమేళాలతో టపాసులు పేల్చుతూ నృత్యాలు చేస్తూ నూతనంగా నిర్మించిన ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకురావడం జరిగింది. అనంతరం గుడి ఆవరణలో పెద్ద పటం వేసి కురువ కులస్థులు పటంపై కూర్చున్నారు. కురువలు వారి కుల బంధువులను పరిచయస్తులను పిలిపించుకుని వారి చేతిలో బండారు పసుపు వేయించుకుని అందరూ సుఖసంతోషాలతో అష్టఐశ్వర్యాలతో విరాజిల్లాలని కోరుకున్నారు. పర్వతాలు, నాగయ్య, సత్యం, శేఖర్, మల్లయ్య, శివ, తిరుపతయ్య ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

'ఏకపక్ష అధికార బదిలీలు సమంజసం కాదు'

తెలకపల్లి, ఫిబ్రవరి 26 : స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ప్రమేయంతో వేరే స్థానానికి బదిలీ చేసి కాంగ్రెస్ పార్టీ అనుచరుల సానుకూలంగా ఉండే పంచాయతీ కార్యదర్శిని తెలకపల్లి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా బదిలీ చేశారనే సమాచారంతో బహుజన సమాజ్ పార్టీ నాయకులు, ఎంపీడీవో కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బీఎస్పీ తెలకపల్లి మండల అధ్యక్షుడు ఆర్‌కె.శివశంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల సానుకూలత కోసం ఏకపక్షంగా అధికారులను బదిలీ చేయడం సరైన పద్ధతి కాదని, వెంటనే బదిలీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. టౌన్ బీఎస్పీ అధ్యక్షుడు గుగ్గిల రాజేష్, బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.